క్లుప్తంగా

తీరంలో విద్యుత్ వెలుగులు



విద్యుత్ వెలుగుల్లో సెంట్రల్ లైటింగ్

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు తీర ప్రాంతాల్లో చీకటి కష్టాలు తీరాయి. ఏళ్ల తరబడి మంగమారిపేట నుంచి భీమిలి వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వాలను, అధికారులను వేడుకున్నప్పటికీ పట్టించుకోలేదు. ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఈ సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జి – 20 సదస్సు నేపథ్యంలో బీచ్ రోడ్డు సుందరీకరణలో భాగంగా రూ.5.67 కోట్లతో చేపట్టిన అభివృద్ధిలో ఈ సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. శనివారం సాయంత్రం లైట్లు ప్రారంభం కావడంతో వెలుగులు ప్రసరించాయి.

15 నుంచి సద్గురు సేవాశ్రమం వార్షికోత్సవాలు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ 4వ వార్డు రామయోగి అగ్రహారంలోని సద్గురు సేవాశ్రమం 13వ వార్షికోత్సవాలు ఈ నెల 15 నుంచి 21 వరకు జరుగుతాయి. ప్రారంభ వేడుకల్లో భాగంగా సోమవారం షిర్డీ సాయిబాబాకు 108 కలశాలతో జలాధివాసం, అఖండజ్యోతి ప్రజ్వలన, సర్వదేవతా హోమాలు జరిపించనున్నట్టు ఆశ్రమ వ్యవస్థాపకుడు యోగారాజు తెలిపారు. ఈ నెల 20 వరకు రోజూ ఉదయం, సాయంత్రం భక్తిపూర్వక సాంస్కృతిక కార్యక్రమాలు, చివరి రోజైన 21న మహా అన్నదానం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

లోక్ అదాలత్‌లో 1,087 కేసుల పరిష్కారం



లోక్ అదాలత్‌లో జడ్జి నాగేశ్వరరావు, అదాలత్ సభ్యులు

భీమునిపట్నం: భీమిలిలోని మూడు కోర్టుల్లో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో మొత్తం 1,087 కేసులు పరిష్కారమయ్యాయి. భీమిలి, ఆనందపురం, పద్మనాభం, పీఎం పాలెం పోలీస్ స్టేషన్ల పరిధికి సంబంధించిన కేసులు పరిష్కారమయ్యాయి. ఇక్కడి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయమూర్తి పి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కేసులు పరిష్కరించారు. అలాగే ఒకటో అదనపు సివిల్ జడ్జి కోర్టులో జడ్జి జి.విజయలక్ష్మి ఆధ్వర్యంలో, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జడ్జి సీహెచ్.పవన్‌కుమార్ ఆధ్వర్యంలో కేసులు పరిష్కరించారు. లోక్ అదాలత్ సభ్యులు పి.ఎస్.చంద్, ఎంవీ.పార్వతీశం, కె.మురళీ కృష్ణ పాల్గొన్నారు.

సీబీఎస్‌ఈలో ఓక్రిడ్జ్ విద్యార్థుల ప్రతిభ




మళ్ల ధృతి, సిరిపురపు శ్రీకర్

తగరపువలస: ఇటీవల ప్రకటించిన సీబీఎస్‌ఈ గ్రేడ్ 10, గ్రేడ్ 12 ఫలితాల్లో భీమిలి మండలం శింగనబంద పంచాయతీ ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. నూరు శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా గ్రేడ్ 10లో 45 శాతం, గ్రేడ్ 12లో 55.5 శాతం విద్యార్థులు డిస్టింక్షన్ సాధించారు. గ్రేడ్ 10లో 500 మార్కులకు సిరిపురపు శ్రీకర్ 474, నుదురుపాటి సాయి ఆశ్రిత 462 మార్కులు సాధించి మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. గ్రేడ్ 12లో 500 మార్కులకు మళ్ల ధృతి 479, తుమ్మల సంహిత 460 మార్కులు సాధించి మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ భమిడిపాటి శైల, డైరెక్టర్ అమిత్‌జైన్ అభినందించారు.

సీఎం జగన్ పాలనలో ఇంటి వద్దకే సేవలు



దుర్గానగర్‌లో అపార్ట్‌మెంట్ వాసుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు



చంద్రంపాలెంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ప్రజల ఇంటి వద్దకే సచివాలయ వ్యవస్థ ద్వారా సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శనివారం సాయంత్రం జీవీఎంసీ 7వ వార్డు దుర్గానగర్ – 1 అండ్ 2 కాలనీలు, చంద్రంపాలెం శివారు ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా ప్రాంతాల్లోని అపార్ట్‌మెంట్లకు వెళ్లి నివాసితుల యోగ క్షేమాలు, సమస్యలు తెలుసుకున్నారు. అయితే ఈ కార్యక్రమానికి జీవీఎంసీ అధికారులు ఆలస్యంగా రావడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇక్కడి కల్లూరి రామకుమారి కుటుంబానికి ప్రభుత్వం ద్వారా ఇంటి స్థలం, ఇల్లు, ఇతర పథకాల ద్వారా రూ.9,29,250 లబ్ధి జరిగిందంటూ ఆనందం వ్యక్తం చేశారు. దుర్గానగర్ 1, 2లలో అపార్ట్‌మెంట్లతోపాటు కల్యాణ మండపాలు, కళాశాలలు ఉన్నాయని, రోడ్లు విశాలంగా ఉన్నా మెయిన్ రోడ్డు నుంచి కాలనీలోకి వచ్చే ఎంట్రన్స్ రోడ్లు చిన్నవిగా ఉండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని, తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు కాలనీవాసులు చెప్పారు. ఈ ప్రాంతాల్లో చైన్ స్నాచింగ్‌లు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిని నియంత్రించాలని, వీధిలైట్లు, రోడ్ల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. ఆయా సమస్యల పరిష్కారానికి అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, వివిధ విభాగాల నాయకులు పిళ్లా సూరిబాబు, పీకేఎం పాత్రుడు, పెంట్ర అప్పన్న, ఎన్.బాబ్జి, జగ్గపిల్లి నరేష్, అల్లాడ లింగేశ్వరరావు, లోహిత్, ఎస్ఎస్ఎన్ మూర్తి, పిళ్లా అప్పన్న, పిళ్లా రమణ, పీస ఉమ, భూలక్ష్మి పాల్గొన్నారు.

రేపటి నుంచి పైడితల్లమ్మ ఉత్సవాలు



పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో పైడితల్లమ్మ ఉత్సవాలు సోమవారం నుంచి జరుగుతాయి. ఇందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. 2012లో పైడితల్లమ్మ ఉత్సవాలు నిర్వహించారు. మళ్లీ 11 సంవత్సరాలకు ఈ ఉత్సవాలు నిర్వహించనుండడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. సోమవారం తొలేళ్లలో భాగంగా అమ్మవారి ప్రతిమలను గ్రామంలో ఊరిగిస్తారు. మంగళవారం సిరిమాను ఉత్సవం పూజారి సుంకర గురునాయుడు నిర్వహిస్తారు. సిరిమాను రథం వెనుక అంజలి, మువ్వ, సుంకర, సురాల వారి రథాలు సాగుతాయి. బుధవారం ముగింపు ఉత్సవం నిర్వహిస్తారు. ఆలయానికి, విగ్రహానికి రంగులు వేసి ముస్తాబు చేశారు. పైడితల్లమ్మ ఆలయం నుంచి పరదేశమ్మ ఆలయం వరకు లైటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు

భీమునిపట్నం: కర్ణాటకలో కాంగ్రెస్ విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు స్థానిక గంట స్తంభం వద్ద శనివారం సంబరాలు జరిపారు. తెడ్డు రాందాసు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. నిమ్మకాయల పైడిరాజు, గురుమూర్తి, కాటా సన్యాసిరావు, వాసుపలి ఎల్లారావు పాల్గొన్నారు.

పేదలకు బియ్యం పంపిణీ



శ్రీనగర్ కాలనీలో పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్న వెంకటేష్ సేవా సంఘం ప్రతినిధులు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు శ్రీనగర్ కాలనీలో శనివారం 5 పేద కుటుంబాలకు వెంకటేష్ సేవా సంఘం అధ్యక్షుడు అక్కరమాని నారాయణరావు బియ్యం ప్యాకెట్లు అందించారు. కార్యక్రమంలో వుయ్ కేర్ యూ సొసైటీ ప్రతినిధి వెంపాడ శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పందిరి విజయ్, అక్కరమాని చినబాబు, బోర చిన్నారెడ్డి, చేట్ల వెంకటి తదితరులు పాల్గొన్నారు.

భీమిలి మండలం తాటితూరు కళ్లాల్లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయిన శిరిగుడి సంతోషి కుటుంబానికి చిట్టివలస హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పొట్నూరు మురళీ మోహన్‌రావు బియ్యం ప్యాకెట్, వెంపాడ శ్రీనివాసరెడ్డి, వాండ్రాసి సతీష్, బాయిన మంగరాజు రూ.1000 అందించారు.

వేసవిలో విజ్ఞాన బోధన



శ్రీ కృష్ణుని చిత్రాలు చూపిస్తున్న చిన్నారులు



చిన్నారులతో మాతాజీ నితాయి సేవిని

సాగర్‌నగర్ ఇస్కాన్ ఆధ్వర్యంలో 15 ఏళ్లుగా సమ్మర్ క్యాంప్

కొమ్మాది: వేసవి సెలవులను పిల్లలు సద్వినియోగం చేసుకునేలా జ్ఞానాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తోంది సాగర్‌నగర్‌లోని ఇస్కాన్ సంస్థ. వేసవి సెలవుల్లో వినోదంతోపాటు విజ్ఞానాన్ని, ఆధ్యాత్మిక భావాన్ని చిన్నారుల్లో నింపేందుకు కృషి చేస్తోంది. గత 15 ఏళ్ల నుంచి ఏటా వేసవి సెలవుల్లో చిన్నారులకు మాతాజీ నితాయి సేవిని ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. చిన్నారులకు రామాయణ, మహాభారత, భాగవతం గ్రంథాల సారాంశాన్ని, అందులోని పాత్రల లక్షణాలు వివరిస్తున్నారు. వాటిని అనుసరించి వినూత్న రీతిలో ఏది మంచి, ఏది చెడు అన్నది క్లుప్తంగా వివరిస్తున్నారు. డ్రామాలు, పెయింటింగ్, సంగీతం, భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు చిన్నారుల జీవితానికి దోహదపడేలా శిక్షణ ఇస్తున్నారు. ఆధ్యాత్మిక సేవ, యోగా, నృత్యాలపై శిక్షణ ఇస్తూ న్యాయకత్వ, సామాజిక నిర్ణయాలు తీసుకునే సమాచార నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఆర్థిక స్థోమత అంతంతమాత్రంగానే ఉన్న వారికి ఈ ఉచిత వేసవి శిక్షణ శిబిరం ఎంతగానో దోహదపడుతోంది. చిన్నారుల వయస్సు, వారి అభిరుచులకు అనుగుణంగా శిక్షణ ఇస్తున్నట్లు మాతాజీ నితాయి సేవిని తెలిపారు. ఈ నెల 8న సాగర్‌నగర్ ఇస్కాన్ ఆధ్వర్యంలో వాల్తేరులో ప్రారంభమైన ఉచిత శిక్షణ శిబిరంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారని ఆమె తెలిపారు. శిబిరం ఈ నెల 22 వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

అభాగ్యులకు సేవ చేయడం అభినందనీయం



అమ్మ ఒడి కేంద్రంలో ఆహారం వడ్డిస్తున్న సీఐ రామకృష్ణ, వెంకటరావు

మధురవాడ: దాతలు, పెద్ద మనసు ఉన్న వారు అనాథ పిల్లలు, అభాగ్యులకు సేవలు అందించడానికి ముందుకు రావడం అభినందనీయమని పీఎం పాలెం సీఐ వై.రామకృష్ణ అన్నారు. మధురవాడలోని అమ్మ ఒడి బాలల సంరక్షణ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లాడ వెంకటరావు, మంగ ద్వితీయ పుత్రిక నేహా జ్ఞాపకార్థం సమకూర్చిన ఆహారం శనివారం వడ్డన చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కల్చరల్ వింగ్ రీజినల్ ఇన్‌చార్జి వంకాయల మారుతీప్రసాద్, సీనియర్ జర్నలిస్ట్ బంగారు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు స్థలం కోసం మత్స్యకారుల ఆందోళన



నిర్మాణ పనుల వద్ద ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేట తీర ప్రాంతం వద్ద రోడ్డుకు స్థలం మినహాయించాలని కోరుతూ మత్స్యకారులు శనివారం ఆందోళన చేశారు. ఇక్కడి బీచ్ సమీపంలో వెంపాడ శ్రీనివాస రెడ్డి అనే వ్యక్తి కొనుగోలు చేసిన జిరాయితీ భూమిలో బేస్‌మెంట్ నిర్మాణ పనులు చేపడుతున్నారు. అయితే బేస్‌మెంట్ నిర్మాణం జరిగితే తాము బీచ్‌కు వెళ్లేందుకు దారి ఉండదని, తమకు కొంత మేర స్థలం రాకపోకల కోసం వదిలేయాలని మత్స్యకారులు శనివారం ఆందోళనకు దిగారు. ఇదిలా ఉండగా ఇక్కడి జిరాయితీ స్థలాన్ని తాము పక్కా డాక్యుమెంట్స్‌తో కొన్నామని, అనుమతి లేకుండా కొందరు మత్స్యకారులు పునాదుల్లోని రాళ్లు తొలగించారని స్థలం యజమాని పేర్కొన్నారు. ఇరువర్గాల మధ్య కొంతసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. తాను సరిహద్దు ప్రకారమే బేస్‌మెంట్ నిర్మిస్తున్నానని, న్యాయపరంగా సమస్య పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని శ్రీనివాసరెడ్డి తెలిపారు.

జూనియర్ కళాశాలకు మహర్దశ



కళాశాల ఆవరణలో నిర్మిస్తున్న మరుగుదొడ్లు



ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటుకు సిద్ధంగా సామగ్రి

'నాడు – నేడు' పథకంలో రూ.1.26 కోట్లతో పనులు

భీమునిపట్నం: భీమిలిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల రూపురేఖలు మారనున్నాయి. విద్యార్థులకు సదుపాయాల కల్పనలో భాగంగా ప్రభుత్వం 'నాడు – నేడు' పథకం కింద నిధులు మంజూరు చేయడంతో ఆయా పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఆ పనులు పూర్తయితే అదనపు సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. ఇక్కడ సుమారు 700 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి అవసరమైన సదుపాయాలు గతంలో అంతంతమాత్రంగానే ఉండడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాఠశాలలు, కళాశాలల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో ఇక్కడి జూనియర్ కాలేజీకి రూ.1.26 కోట్లు మంజూరు చేశారు. ఆ నిధులతో పనులు ఇటీవల ప్రారంభమై చురుగ్గా జరుగుతున్నాయి. కళాశాల ఆవరణలో విద్యార్థిని, విద్యార్థులకు వేర్వేరుగా మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు. వీటిని జూన్‌లో కళాశాల ప్రారంభమయ్యే నాటికి అందుబాటులోకి తీసుకురానున్నారు.

అలాగే స్వచ్ఛమైన మంచినీరు అందివ్వడానికి రెండు ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేయనుండగా, దానికి సంబంధించిన సామగ్రి సిద్ధంగా ఉంది. కొద్ది రోజుల్లో దీని ఏర్పాటు పూర్తవుతుంది. దీంతోపాటు అన్ని తరగతి గదులకు అవసరమైన మరమ్మతులు చేపట్టి రంగులు వేయడంతోపాటు కొత్త ఫ్యాన్లు, లైట్లు, ఫర్నీచర్, గ్రీన్‌బోర్డులతోపాటు ఇతర సదుపాయాలు కల్పిస్తున్నారు. ఈ సదుపాయాలన్నీ త్వరలోనే విద్యార్థులకు అందుబాటులోకి వస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి.

డీఆర్‌డీఏ మహిళా ప్రాంగణాల సందర్శన

డాబాగార్డెన్స్: జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ శనివారం ఆరిలోవ, పెందుర్తి ప్రాంతాల్లోని డీఆర్‌డీఏ మహిళా ప్రాంగణాలు సందర్శించారు. శిక్షణ సమయంలో వారికి కావల్సిన మౌలిక వసతులతో పాటు భోజనం, తదితర వసతులపై కమిషనర్ ఆరా తీశారు. మహిళలు ఉత్తమ శిక్షణతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని శిక్షణ పొందుతున్న ఏఎన్ఎంలకు సూచించారు. శిక్షణలో ప్రావీణ్యం పొంది ప్రజలకు మెరుగైన సేవలు అందివ్వాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ వై. శ్రీనివాసరావు, జోనల్ కమిషనర్లు కనకమహాలక్ష్మి, మల్లయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ముత్తంశెట్టి



ఎమ్మెల్యే ముత్తంశెట్టికి ప్రసాదం అందజేస్తున్న ఏఈవో శ్రీనివాసరావు

సింహాచలం: శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామిని శనివారం భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని ఏఈవో శ్రీనివాసరావు అందజేశారు.

సంతబయలు రహదారి మురుగుమయం



అన్నపూర్ణ కాంప్లెక్స్ వద్ద రహదారిపై మురుగు



ప్రైవేట్ మార్కెట్ ముఖద్వారం వద్ద రహదారిపై ప్రవహిస్తున్న మురుగు

డ్రైనేజీలపై ఆక్రమణలతో పారిశుధ్య పనులకు ఆటంకం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ 1, 2 వార్డుల పరిధిలోని సంతబయలు రహదారి మళ్లీ మురుగునీటితో నిండిపోయింది. ఈ మార్గంలో డ్రైనేజీలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో పారిశుధ్య సిబ్బంది పనులకు నిత్యం ఆటంకం కలుగుతోంది. ప్రైవేట్ మార్కెట్ ముఖద్వారం నుంచి భీమిలి రోడ్డు వరకు డ్రైనేజీలు కూరగాయల వ్యర్థాలు, ఖాళీ సీసాలు, ఖాళీ కొబ్బరి బోండాలతో నిండిపోవడంతో మురుగునీటి ప్రవాహానికి ఇబ్బందిగా మారింది. దీంతో మురుగునీటిలో నుంచే ప్రైవేట్ మార్కెట్‌లోకి వినియోగదారులు, వ్యాపారులు రాకపోకలు సాగిస్తున్నారు. అంతేకాకుండా రహదారికి ఇరువైపులా వ్యాపారాలు, నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారు సైతం మురుగునీటి ప్రవాహం కారణంగా అందులో నుంచే ఇంట్లోకి, బయటకు ముక్కు మూసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. ఏడాది క్రితం ఇదే సమస్య కారణంగా టౌన్ ప్లానింగ్ అధికారులు డ్రైనేజీలపై ఆక్రమణలు తొలగించాలని ప్రయత్నించి విఫలమయ్యారు. అయినప్పటికీ ఆక్రమణదారులు డ్రైనేజీలపై నిర్మాణాలను తొలగించలేదు. ముఖ్యంగా పారిశుధ్య పనులకు ఇబ్బందిగా ఉండడంతో డ్రైనేజీలను తెరిచి మురుగునీరు సాఫీగా వెళ్లిపోవడానికి చెత్త తొలగింపునకు చర్యలు చేపట్టాలని స్థానికులతోపాటు పారిశుధ్య సిబ్బంది కోరుతున్నారు.

పట్టాభిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



భీమిలి సీఐ లక్ష్మణమూర్తికి ఫిర్యాదు చేస్తున్న యాదవ సంఘ నాయకులు

తగరపువలస: యాదవులను, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును కించపరిచిన టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ యాదవ సంఘ ప్రతినిధులు భీమిలి పోలీసులను శనివారం ఆశ్రయించారు. ఈ మేరకు భీమిలి సీఐ కె.లక్ష్మణమూర్తికి ఫిర్యాదు చేశారు. ఇటీవల ఒక చానల్‌లో యాదవ జాతిని, గౌరవ మంత్రిని అసభ్య పదజాలంతో దూషించిన పట్టాభి తక్షణమే బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా మహిళలు, యాదవులు, ప్రజాప్రతినిధులంటే గౌరవం లేని పట్టాభిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. భీమిలి నియోజకవర్గ యాదవ సంక్షేమ సంఘ నాయకులు, భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, తాళ్లవలస పంచాయతీ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అక్కరమాని అప్పలనాయుడు, లొడగలవానిపాలెం సర్పంచ్ ఎల్.రమణ, కొంగరాని ఎర్రాజీ తదితరులు ఫిర్యాదు చేశారు.

హనుమాన్ జయంతికి ఏర్పాట్లు



రామాద్రిలో హనుమాన్ విగ్రహం



మద్ది జంక్షన్‌లో హనుమాన్ విగ్రహం

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేట హంసవన పుణ్యక్షేత్రం రామాద్రిలో ఆదివారం శ్రీ హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి పంచామృతాభిషేకాలు, సహస్ర సింధూర, తమలపాకుల పూజ, నీరాజనం, మంత్రపుష్పం, సాయంత్రం హనుమాన్ చాలీసా పారాయణ, అనంతరం రథోత్సవం నిర్వహించనున్నారు. అదేవిధంగా మారికవలస, కాపులుప్పాడ, సోమన్నపాలెం, చేపలుప్పాడ, ఎండాడ, రుషికొండ ప్రాంతాల్లో గల ఆంజనేయస్వామి ఆలయాల్లో వేడుకలకు ఏర్పాట్లు చేశారు.

పద్మనాభం: మండలంలోని పలు గ్రామాల్లో హనుమాన్ జయంతికి ఆలయాలు సిద్ధమయ్యాయి. మద్ది, పద్మనాభం, రేవిడి జంక్షన్‌లో, కోరాడ, తునివలస, పాండ్రంగి, రెడ్డిపల్లి, అనంతవరం, కృష్ణాపురం గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆలయాలను అరటి మొక్కలు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

ఆధునిక టెక్నాలజీతో వైద్య సేవలందించాలి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభిస్తున్న వైద్యులు

మధురవాడ: వైద్య రంగంలో వస్తున్న మార్పులు, ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి రోగులకు వైద్యులు సేవలందించాలని ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. జి.బుచ్చిరాజు సూచించారు. మధురవాడలోని గాయత్రి విద్యా పరిషత్ వైద్య కళాశాలలో జనరల్ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో గుండె సంబంధిత వైద్యంపై 'సీఎంఈ కార్డియాలజీ అప్‌డేట్ మీట్' పేరుతో శనివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కార్డియాలజిస్ట్ సుజాత మాట్లాడుతూ ఈ ప్రాంత వాసులకు గుండె వైద్యం మరింత చేరువ చేయడం కోసం పీపీ పద్ధతిలో పనిచేస్తున్నామన్నారు. నూతన ఒరవడితో గుండె సంబంధిత సమస్యలకు వైద్యం అందిస్తున్నామన్నారు. గాయత్రి విద్యా సంస్థల కార్యదర్శి ఆచార్య సోమరాజు మాట్లాడుతూ ఈ ఆస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ సేవలు కూడా అందిస్తున్నామని పేర్కొన్నారు. త్వరలో క్యాన్సర్, ఇతర సమస్యలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురానున్నామని తెలిపారు. అన్ని రకాల వైద్యానికి ఆరోగ్యశ్రీ వర్తిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఏపీ మెడికల్ కౌన్సిల్ పరిశీలకులు డాక్టర్ అచ్యుతరావు, జీపీపీ ప్రెసిడెంట్ డాక్టర్. పి.శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్. బీఎల్ఎస్ ప్రసాద్, సెక్రటరీ డాక్టర్. వి.ధర్మారావు, జేఎస్ కామేశ్వరరావు, కేర్, అపోలో ఆస్పత్రుల కార్డియాలజిస్టులు డాక్టర్ సీవీ రావు, డాక్టర్ కె.బారువ, అనిల్ మహా పాత్ర, నగరంతోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన 250 మంది వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.